# హోం వర్క్ చేయలేదని ..

- విద్యార్థిని చితకబాదిన ప్రైవేటు స్కూల్ టీచర్
- ప్రశ్నించిన విద్యార్థి తల్లిదండ్రులు
- నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన స్కూల్ యాజమాన్యం



విద్యార్థి వీపు పడిన వాతలు (సర్కిళ్లు)

కొండమల్లేపల్లి, డిసెంబర్ 2: హోం వర్క్ చేయలేదని ఓ ఉపాధ్యాయురాలు విచక్షణారహితంగా ఓ విద్యార్థిని చితకబాదిన ఘటన కొండమల్లేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని నాగార్జున గ్రామర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో చిన్నఅడిశర్లపల్లిలో బుడ్డోనితండాకు చెందిన మూడావత్ బాల ధనుష్ ఒకటో తరగతి చదువుతున్నాడు. హోం వర్క్ చేయలేదని మ్యాథ్స్ టీచర్ కర్రతో చితకబాదింది. వీపుపైన వాతలు పడ్డాయి. ఈ విషయాన్ని విద్యార్థి ఇంట్లో చెప్పలేదు. తల్లి స్నానం చేయిస్తూ వీపుపైన వాతలు గమనించి అడగగా టీచర్ కొట్టిన విషయాన్ని విద్యార్థి చెప్పాడు. వెంటనే తల్లిదండ్రులు స్కూల్‌కు వెళ్లి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థి సంఘాలను ఆశ్రయించారు. వారు ఫోన్ చేయగా స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది. దీంతో విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలకు వెళ్లి ప్రశ్నించగా యాజమాన్యం నిర్లక్ష్య ధోరణిలోనే సమాధానం చెప్పింది. ఈ విషయమై ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిని అడగగా ఉపాధ్యాయురాలు విద్యార్థిని కొట్టిన విషయం వాస్తవమే. ఆమెను విధుల నుంచి తొలగిస్తామని, ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వీరబాబు తెలిపారు.

# యాసంగి సాగుకు సిద్ధం

- వరి నాట్లు వేస్తున్న రైతులు

హాలియా/ త్రిపురారం, డిసెంబర్ 2: యాసంగిలో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. సాగర్ నియోజకవర్గంలోని ఆయకట్టు రైతులు వరి నాట్లు వేసుకునేందుకు నారు మడులను సిద్ధం చేసుకున్నారు. గత ఏడాది యాసంగిలో లక్షా 20 వేల ఎకరాల్లో వరి సాగు చేసిన రైతులు ఈ ఏడాది యాసంగిలో సాగర్ జలాశయంలో నీరులేకపోవడంతో లక్ష ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశం ఉంది. త్రిపురారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులు బోర్లు, బావుల వద్ద వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. బోర్లు 60 నుంచి 70 ఫీట్ల లోతులో పడడం, కొన్నిచోట్ల మోటార్లు మూడు, నాలుగు ఇంచుల్లో కూడా నీళ్లు వస్తుండడంతో రైతు లు కాల్వపై ఆధారపడకుండా త్వరగా వరి నాట్లు పూర్తి చేస్తున్నారు. కరెంట్ అందడం, వడ్లకు ధర ఎక్కువ ఉండడంతో రైతులు వరి నాట్లు వేయడానికి మొగ్గు చూపుతున్నారు. కూలీల కొరత లేకుండా తక్కువ సేద్యం ఉండడంతో ఎండాకాలం రాకముందే నాట్లుకు సిద్ధమయ్యా రు. ఈనెల 15 వరకు నాట్లు వేస్తే ఫిబ్రవరి ఆఖరికల్లా వరి కోతలు కోసుకోవచ్చని రైతులు భావిస్తున్నారు.



త్రిపురారం మండలం ఫాల్తితండాలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు



సత్యనారాయణపురంలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

## 30 ఫీట్ల లోతులోనే జలధార



రైతు వెంకటమ్మ పొలంలో వేస్తున్న బోరు

త్రిపురారం : మండలంలోని రాగడప గ్రామ పంచాయతీలో సిరసవాడ వెంకటమ్మకు చెందిన వ్యవసాయ పొలంలో శనివారం బోరు వేయగా 30ఫీట్ల లోతులోనే రెండు ఇంచుల జలధార ఉప్పొంగుతూ బయటకు వచ్చింది. మూడు ఎకరాల్లో వరి పంట పండించుకోవడానికి నీళ్లు ఇబ్బందులు లేకుండా ఉంటుందని వెంకటమ్మ తెలిపారు. అతి కొద్ది లోతులోనే నీళ్లు అవి కూడా ఆగకుండా పోస్తుండడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



నీటిని పోస్తున్న బోరు

# అధిక సాంద్రత పత్తి సాగుపై అవగాహన



వర్ధమానుకోటలో మాట్లాడుతున్న కేవీకే ఇన్‌చార్జి నరేశ్

నాగారం, డిసెంబర్ 2 : కృషి విజ్ఞాన కేంద్రం గడ్డిపల్లి ఆధ్వర్యంలో శనివారం నాగారం మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.కేవీకే ఇన్‌చార్జి ప్రొగ్రామ్ కో–ఆర్డినేటర్ డి.నరేశ్, కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తి సాగులో చేపట్టాల్సిన మెళకువలు, యాంత్రీకరణ పద్ధతుల గురించి తెలిపారు. ఎరువుల యాజమాన్యం, చీడ పీడల నివారణ, సస్యరక్షణ చర్యలు, లింగాకర్షక బుట్టల వినియోగం, జిగురు అట్టలు వాడే విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రాశి సీడ్స్ ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.నరేశ్, విక్రమ్, సంతోశ్, మౌనిక పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గెలుపు ఖాయం

- జడ్పీటీసీ అరుణసురేష్‌గౌడ్

దేవరకొండ, డిసెంబర్ 2: దేవరకొండలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ గెలుపు ఖాయమని జడ్పీటీసీ అరుణసురేష్‌గౌడ్ శనివారం ఒక ప్రకట నలో ధీమా వ్యక్తం చేశారు. దేవరకొండ ఖిల్లాపై నాలుగో సారి గులాబీ జెండా ఎగురనున్నట్లు ఆమె చెప్పారు. ప్రతి మండలంలో బీఆర్ఎస్‌కి భారీ మెజార్టీ వస్తుందని తెలిపారు.

## మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

కొండమల్లేపల్లి: రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రానుందని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన రైతుబంధు మండల అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి. జడ్పీటీసీ సలహాదారుడు పస్నూరీ యుగేందర్‌రెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు విస్మరించరని తెలిపారు. ప్రజలకు సీఎం కేసీఆర్‌పై పూర్తి నమ్మకం ఉందని అన్నారు. దేవరకొండలో రవీంద్రకుమార్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలిమినేటి సాయి, కోడిదాల వెంకటయ్య, పెద్దశెట్టి సత్యనారయణ, బావండ్ల దుర్గయ్య, అందుగుల వెంకటేష్, వస్కుల శ్రీను, ముశిని శేఖర్ యాదవ్, కొడిదాల శ్రీను, వరికుప్పల పాండు, కొప్పెర చంద్రమౌళి, బోడ గిరి, అల్లుల సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోపాలస్వామి దేవాలయంలో గిరిజనుల పూజలు



గోపాలస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న గిరిజనులు

నేరెడుగొమ్ము(చందంపేట), డిసెంబర్ 2: మండలంలోని చిన్నమునిగల్ పంచాయతీలో ఉన్న బ్యాక్‌వాటర్ ఒడ్డుపై ఉన్న గోపాలస్వామి దేవాలయంలో శనివారం యాపలపా యతండాకు చెందిన అమ్రవాడకు చెందిన గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏడాది లాగానే ఈసారి కూడా పూజలు నిర్వహించారు. దేవాలయంలో వాల్య మసన్, చాలక్‌రాం, సర్దార్‌సింగ్ బావోజీలకు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గిరిజనులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బిచ్చునాయక్, శ్రీను, నాగేశ్వర్‌నాయక్, హన్మానాయక్, మధునాయక్, బోజ్యా, శ్రీను, సుభాష్‌నాయక్, పవన్, వినోద్, సోమాణి తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి

- ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి రవికుమార్

నూతనకల్, డిసెంబర్ 2 : గ్రామీణ ప్రాంతాల్లో నేటికి కొనసాగుతున్న బాల్య వివాహాలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జి చిప్పెలపల్లి రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని గుగులోతు తండాలో కిశోర్‌బాలికలకు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే పెండ్లిండ్లు చేస్తే బాలికలు అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. బాలికలకు 18 ఏండ్లు, బాలురకు 21ఏండ్లు వచ్చే వరకు వివాహం చేయకూడదని తెలిపారు. బాల్య వివాహాలు జరిగితే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో లలిత, చక్రి, మాలతి తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

## గర్భిణులు టీకాలు తీసుకోవాలి

నూతనకల్, డిసెంబర్ 2 : గర్భిణులు క్రమ తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గర్భిణులు, చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాల క్యాంప్‌ను నిర్వహించారు.

## పేదలను ఆదుకోవడమే కనకయ్య ఫౌండేషన్ లక్ష్యం

మాల్, నవంబర్ 2: పేదలను ఆదుకోవడమే కనక్కయ్య ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ చైర్మన్ పగడాల ముత్తు అన్నారు. శనివారం చింతపల్లి మండలంలోని గొడకొండ్లలోని పగడాల కనకయ్య మెమోరియల్ ఫౌండేషన్ రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.